ప్రజాశక్తి
మంగళవారం 22 ఆగస్టు 2023
5
పార్వతీపురం మన్యం



డిప్యూటీ సిఎంకు సెర్ప్ ఉద్యోగుల సన్మానం



డిప్యూటీ సిఎం రాజన్నదొరను సన్మానిస్తున్న ఆర్‌పిలు

సాలూరు : డిప్యూటీ సిఎం రాజన్నదొరను జిల్లా వెలుగు ఉద్యోగులు, అధికారులు సోమవారం సన్మానించారు. ఆయన నివాసంలో కలిసిన అనంతరం వెలుగు ఉద్యోగులకు 23శాతం జీతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వారు ధన్యవాదాలు తెలిపారు. రాజన్నదొరకు దుశ్శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డిపిఎం అప్పారావు, ఎపిఎంలు సింహాచలం, సత్యనారాయణ, సన్నిబాబు, జయకుమార్, భారతి, త్రినాధమ్మ పాల్గొన్నారు.

వర్షాలు కురిసినా వెనుకబాటే

- లక్ష్యానికి దూరంగా ఖరీఫ్ సాగు
- పాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్ట
- ఆందోళనలో రైతులు



ఇంకా పడని వరినాట్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పుష్కలంగా వర్షం కురిసింది. అందుకు తగ్గట్టే పొలం తడిసింది. వరినారు ఏపుగా పెరిగింది. కానీ, ఉబాలు లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగలేదు. చెరకు, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు కూడా అంతంత మాత్రంగానే సాగయ్యాయి. ఇందుకు ముమ్మాటికీ పాలకులు ప్రదర్శించిన నిర్లక్ష్యమే కారణం. దీంతో రైతాంగం ఆందోళనకు గురౌతోంది. పెట్టుబడులు ఏమౌతాయో అన్న బెంగ ఓ వైపు.. శ్రమ వృథాగా పోతుందా? అన్న ఆందోళన ఇంకోవైపు. ఏ రైతును కదిపినా ఇదే వ్యథ.

జిల్లాలో సాధారణంగా జూన్ చివరి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావాల్సి ఉంది. గత కొన్నాళ్ల నుంచి రుతుపవనాలు ఆలస్యం కావడంతో జులై ఒకటి లేదా రెండో వారంలోనైనా నారు పోతలు మొదలయ్యేవి. ఈ ఏడాది అందుకనుగుణంగా వర్షాలు కురవడంతో వరినారు పోతలు, ఇతర పంటల సాగు ఒకింత ఉత్సాహంగానే మొదలైంది. అయినప్పటికీ కురిసిన వర్షపునీటిని ఒడిసిపట్టేందుకు తగిన సాగునీటి వనరులు లేకపోవడంతో సముద్రం పాలైంది. మరోవైపు ఎండల తీవ్రత కూడా ఎక్కువగా ఉండడంతో కాస్త చెరువుల్లో చేరిన నీరు ఆవిరైపోతోంది. దీంతో, ఎదిగిన వరినారు ముందు పెట్టుకుని వరుణుడి కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లా ప్రధాన పంట వరి. ఖరీఫ్ సీజన్‌లో 2,25,637 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 75,770 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. గత ఏడాది ఇదే సరిగ్గా సమయానికి 1,35,477 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. దీన్నిబట్టి సుమారు 30 శాతం వెనుకబడి ఉన్నట్టు స్పష్టమౌతోంది. మొక్కజొన్న గత ఏడాది ఇదే సమయానికి 29,472 ఎకరాల్లో సాగవగా, ప్రస్తుతం 19,885 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఇందులోనూ 25 శాతం వ్యత్యాసం కనిపిస్తోంది. పత్తి గతేడాది 4,310 ఎకరాలు సాగు కాగా, ప్రస్తుతం 3 వేలకు మించలేదు. చెరకు సాగు 10,392 ఎకరాలకు గాను ప్రస్తుతం 7 వేల ఎకరాలు మాత్రమే సాగైంది. వేరుశనగ గతేడాది ఇదే సమయానికి 767 ఎకరాలు కాగా, ఈ ఏడాది 420 ఎకరాల్లో మాత్రమే సాగు అయింది. నువ్వులు, ఇతర అపరాలు తదితర పంటలన్నింటి సాగులోనూ ఇదే రకమైన వెనుకబాటు కనిపిస్తోంది.

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో అన్ని పంటలు కలుపుకుని 3,17,052 ఎకరాల మేర సాగు విస్తీర్ణం కాగా, గత ఏడాది ఇదే సమయానికి 2,01,535 ఎకరాల్లో సాగు కనిపించింది. ఈ ఏడాది కేవం 1, 38,755 ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. గత ఏడాది అన్ని పంటలూ కలుపుకుని ఈ సమయానికి 64 శాతం సాగవగా, ఈ ఏడాది 43 శాతమే సాగయ్యాయి. మరోవైపు సీజన్ ముంచుకెళ్తోంది. వర్షపాతాన్ని పరిశీలిస్తే సాధారణ వర్షపాతం కన్నా 10 మిల్లీమీటర్ల వర్షపాతం అధికంగానే కురిసింది. జూన్ నుంచి ఇప్పటి వరకు 340.2 మిల్లీమీటర్ల వర్షపాగానికి గాను ఇప్పటి వరకు 440.1 మి.మీ వర్షం కురిసింది. దీన్నిబట్టి వర్షాలు కురిసినా వాటిని నిల్వచేసేందుకు తగిన వనరులు ప్రభుత్వం తయారు చేయలేదన్నది స్పష్టమౌతోంది.

జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి

ఐటిడిఎ పాలకవర్గ సమావేశం నిర్వహించాలి
సిపిఎం కార్యదర్శి రెడ్డి వేణు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యద్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - సాలూరు

జిల్లా అభివృద్ధికి అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు పని చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. సోమవారం ఆయన స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయ విమర్శలు తగ్గించి జిల్లా ప్రగతిపై దృష్టి సారించాలని సూచించారు. గత కొంతకాలంగా ఐటిడిఎ పాలకవర్గ సమావేశం నిర్వహించలేని పరిస్థితిలో అధికార యంత్రాంగం ఉందన్నారు. నిరుద్యోగ యువతకు, ఉపాధి కల్పనకు సరైన ప్రణాళిక రూపకల్పన చేయాలని కోరారు. గిరిజన యువతకు ఉపాధి శిక్షణ కోసం ఏర్పాటు చేసిన వైటిసిలు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నాయని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో భూ సమస్యలు పెరిగిపోతున్నాయని చెప్పారు. జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టు చివరి భూములకు నీరందని పరిస్థితి ఇప్పటికీ వుందని చెప్పారు. పెద్దగెడ్డ, తోటపల్లి ప్రాజెక్టుల నిర్వాసితుల సమస్యలు ఇంకా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. సాలూరు మండలంలోని జీగిరాం జ్యూట్ మిల్లును తెరిపించడానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్మికులు ఆకలి మంటలతో అలమటిస్తున్నారని చెప్పారు. సాలూరు పట్టణంలో సెప్టెంబర్ 9,10,11 తేదీల్లో పార్టీ వర్క్‌షాప్ జరుగుతుందని, ఈ వర్క్‌షాప్‌లో ప్రజల సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు. సమావేశంలో సిపిఎం పట్టణ, మండల కార్యదర్శు ఎన్వైనాయుడు, ఎం.శ్రీనివాసరావు ఉన్నారు.

జాతీయస్థాయి వర్క్‌షాపులో పాల్గొన్న మజ్జి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు అరుదైన అవకాశం దక్కింది. పంచాయతీరాజ్ వ్యవస్థలో సుపరిపాలన అంశంపై శ్రీనగర్‌లో సోమవారం ప్రారంభమైన మూడు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాపులో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలోని జెడ్‌పి చైర్మన్లందరికీ ఆయన ప్రాతినిధ్యం వహిస్తూ, ఆంధ్రప్రదేశ్ తరపున ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సదస్సుకు జెడ్‌పి చైర్మన్‌తో పాటు చిత్తూరు జిల్లా పుంగనూరు ఎంపిపి భాస్కరరెడ్డి, ఎస్‌పిసి (ఐటి) బాలాజీ, తణుకు మండలం దువ్వ సర్పంచ్ ఎ.వెంకట సూర్యనారాయణ మూర్తి, ఎలమంచిలి మండలం పెనుమత్రు సర్పంచ్ కె.గోపి రాష్ట్రం తరపున హాజరయ్యారు. సుపరిపాలన ద్వారా సుస్థిరాభివృద్ధి సాధించడం, ప్రజలకు మెరుగైన పాలన, విద్య, వైద్య సదుపాయాలను అందించడం ఈ వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశం. సదస్సులో పాల్గొన్న తర్వాత కేంద్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రిని, ప్రజాప్రతినిధులను, కేంద్ర ఉన్నతాధికారులను కలిసి, పలు అంశాలపై చర్చించారు.

అర్జీదారులతో అధికారులు మాట్లాడాలి



ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీలు అందజేసిన వారితో అధికారులు నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు, జిల్లారెవిన్యూ అధికారి జె.వెంకటరావుతో కలిసి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యలను గుర్తించి వివరాలను సంబంధిత జిల్లా అధికారులను అడిగి తెలుసుకొని, పరిష్కారం చూపాలన్నారు. ప్రతి సోమవారం జిల్లా, మండల, గ్రామ స్థాయిలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమం తమ సమస్యలను తెలియజేస్తూ అర్జీలు అందజేసిన వారితో అధికారులు నేరుగా మాట్లాడాలని, వారికి సంతృప్తికరమైన, నాణ్యత కలిగిన పరిష్కారం చూపించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు పలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 110 అర్జీలు వచ్చాయి. స్పందన కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

స్పందనకు 66 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో నిర్వహించిన స్పందనకు 66 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమాన్ని సోమవారం ఎపిఒ రోసి రెడ్డి నిర్వహించారు. స్వీకరించిన వినతుల్లో కొన్ని... దోనుబాయికి చెందిన జగ్గారావు పవర్‌వీడర్ మంజూరు చేయాలని, దుగ్గికి చెందిన సూరమ్మ పిండి మిల్లు మంజూరు చేయాలని విన్నవించారు. పెద్దోడుగూడకు చెందిన సవర ఆనప తాగునీటి సమస్య పరిష్కరించాలని, గజిలికి చెందిన అమోస్ ఆటో రుణం ఇప్పించాలని కోరారు. పోంజాడకు చెందిన సవర ఏసుబాబు మేకల్లోను ఇప్పించారని విన్నవించారు. రాయిలంకకు చెందిన ఆనంద్ టెంట్ హౌస్‌కు రుణం, బొక్కిడిగూడకు చెందిన జగదీష్ కొండ చీపుర్ల వ్యాపారానికి రుణం మంజూరు చేయాలని కోరారు. లంగడు గూడకు చెందిన మొక లింగం కిరాణా షాపు లోన్ ఇప్పించాలని, పోంజాడకు చెందిన ధర్మారావు ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ స్పందన కార్యక్రమంలో డిడి శ్రీనివాసరావు, ఇఇ సింహాచలం, జిసిసి డిఎం సంధ్యారాణి, సిడిపిఒ రంగలక్ష్మి, ఎపిఒ హరికృష్ణ, డిప్యూటీ డిఇఒ లిల్లీ రాణి, డిప్యూటీ డిఎంహెచ్ఒ చిరంజీవి, ఎటిడబ్ల్యూఒ మంగవేణి పిహెచ్ఒ గణేష్, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన వినతులను సత్వరమే పరిష్కరించాలి : ఎస్‌పి

పార్వతీపురం రూరల్ : స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి వెంటనే వారికి న్యాయం చేయాలని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌పి ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యలపై ఫిర్యాదుదారులు విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదే పదే పోలీసు స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండకూడదని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై వచ్చిన ఫిర్యాదులపై స్పందించి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి సూచించారు. ప్రజలకు సైబర్ క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్ లైన్ వెబ్ సైట్ www.cybercrime.gov.in ద్వారా ది నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లోనూ, టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయొచ్చని ప్రజలకు ఎస్పీ సూచించారు. స్పందన కార్యక్రమంలో ఎఎస్పీ (అడ్మిన్) ఒ.దిలీప్ కిరణ్, ఎస్‌బిసిఐ సిహెచ్.లక్ష్మణరావు, డిసిఆర్‌బి సిఐ ఎన్‌వి ప్రభాకర్ రావు, ఎస్ఐ పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష మందితో సిఎం సభ



సిఎం సభ విజయవంతంపై సమీక్షిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 25న గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు సిఎం జగన్‌మోహన్ రెడ్డి రానున్న నేపథ్యంలో సభ విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లపై డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో పాటు ఇతర జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన నిర్వహించిన సమావేశంలో సభ విజయవంతం చేయడానికి అనుసరించాల్సిన ప్రణాళిక రూపకల్పన, ఏ అధికారి ఏ పనులు నిర్వహించాలనే అంశాలపై చర్చించారు. భారీ జనసమీకరణ చేయాల్సిన తరుణంలో రవాణా, హాజరైన కార్యకర్తలకు భోజన ఏర్పాట్లు గురించి చర్చించారు. ఎక్కడా ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీస్, రవాణా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. ముఖ్యమంత్రి బహిరంగ సభ ప్రాంగణం వద్ద గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా నత్య ప్రదర్శనలు ఉండాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు శ్రీనివాస్‌కు సూచించారు. అధికారులతో సమీక్షా సమావేశానికి మీడియాని అనుమతించలేదు. సమావేశం అనంతరం డిప్యూటీ సీఎం రాజన్నదొర మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ చాంబర్లో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గం నుంచి పదివేలకు పైగా జనసమీకరణ చేయనున్నట్లు చెప్పారు. ఈ మేరకు రవాణా సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఉదయం పార్టీ మండలాల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఏఏ మండలం నుంచి ఎంత మంది వస్తారో అంచనా వేసి ఏర్పాట్లు చేయాలని సూచించారు. రామభద్రపురం, బాడంగి మండలాల నుంచి కూడా జనసమీకరణ చేయనున్నట్లు చెప్పారు. దత్తిరాజేరు, గజపతినగరం, మెంటాడ మండలాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు హాజరవుతారని చెప్పారు. లక్షకు పైగా జనసమీకరణతో సిఎం సభను విజయవంతం చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో డిఆర్ఒ జె.వెంకట్రావు, ఐటిడిఎ ఎపిఒ మురళి, డ్వామా, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్లు కె.రామచంద్రరావు, పి.కిరణ్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి సి. మల్లికార్జున రెడ్డి, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారి టి శాంతీశ్వరరావు, స్థానిక తహశీల్దార్ బాలమురళీకృష్ణ, సర్కిల్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాసరావు, ధనుంజయ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సిఎం సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మి

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

దత్తిరాజేరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఈ నెల 25న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను విజమయనగరం జిల్లా కలెక్టర్ ఎ.నాగలక్ష్మి పరిశీలించారు. సోమవారం మెంటాడ మండలం కుంటినవలస, దత్తిరాజేరు మండలం మరడాం గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. మరడాం వద్ద ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభాస్థలిని సందర్శించారు. అధికారులతో మాట్లాడి చేస్తున్న ఏర్పాట్లను తెలుసుకున్నారు. నిరాటంకంగా సభ జరగాలని, ఎటువంటి అంతరాయం కలగకూడదని స్పష్టం చేశారు. పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాలను పరిశీలించారు. విఐపిల వాహనాలకు వేరుగా పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని, వాహనాలకు సభాస్థలి సమీపంలో పార్కింగ్ ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి, అక్కడ కూడా విఐపిలు వేచి ఉండటానికి, వాహనాల పార్కింగ్‌కు తగిన ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖను, డిసిహెచ్‌ఎస్‌ను ఆదేశించారు. కుంటినవలసలో గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపన కార్యక్రమం, శిలాఫలకాన్ని ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆర్‌అండ్‌బి ఆధ్వర్యంలో చేపడుతున్న నేలను చదును చేసే పనులపై ఆరాతీశారు. ఇక్కడినుంచి పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్న సుమారు 4 కిలోమీటర్ల రహదారి పనులను తనిఖీ చేశారు. పర్యటనలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో గల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులుకు సెప్టెంబర్ 5న గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల నుండి దరఖా స్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు నమూనాను సంబంధిత ఎంఇఒ కార్యాలయంలో పొందవచ్చునని తెలిపారు. ఉపాధ్యాయ, ప్రధానో పాధ్యాయ సర్వీసు 15ఏళ్లు ఉండాలని, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ పొంది, ఎటువంటి క్రమశిక్షణా చర్యలు లేని ఉపాధ్యా యులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సంబంధిత ఎంఇఒ, డిప్యూటీ డిఇఒ వారి ద్వారా ఈనెల 22లోగా దరఖాస్తులు తన కార్యాలయంలో సమర్పించాల్సిందిగా పేర్కొన్నారు.





సాలూరు, పాలకొండ పట్టణాల్లో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

మున్సిపల్ కార్మికుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - సాలూరు

తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈనెల 24న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కార్మికులు సోమవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు ఆధ్వర్యాన కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మధ్యవర్తులు లేని వ్యవస్థను తీసుకొస్తానని ఆప్కోస్‌ను ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ఆప్కోస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం గా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు టి.ఇందు, కార్మికులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: మున్సిపల్ (ఆప్కాస్) కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి, అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఈనెల 24న జరుగు చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పాలకొండలో నిర్వహించిన బైక్ ర్యాలీలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పాలకొండ కమిటీ అధ్యక్షులు పడాల భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి చింతల సంజీవి, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులు వై. హరిబాబు, ఉపాధ్యక్షులు చింతల సురేష్, పడాల బాలు, వండన ఆంజనేయులు, పి. సాయి, సురేష్, టి ఈశ్వర్, జి. నారాయణరావు, రాజేషు తదితరులు పాల్గొన్నారు.

భూముల కేటాయింపు సక్రమమే
ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

గ్రోత్‌సెంటర్లో సత్య బయోఫ్యూయల్ పరిశ్రమకు భూముల కేటాయింపులో అక్రమాలు లేవని, ఎపిఐఐసి నిబంధనలకు లోబడి భూములు కేటాయింపు జరిగిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు స్పష్టంచేశారు. సోమవారం వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రోత్‌సెంటర్లో పరిశ్రమకు భూముల కేటాయింపుపై వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడడం సరికాదన్నారు. హెరిటేజ్ సంస్థ ఎంతకు భూములు తీసుకుందని, ఎచ్చెర్లలో కళా వెంకటరావు ఎంతకు తీసుకున్నారని ప్రశ్నించారు. సత్య బయోఫ్యూయల్ పరిశ్రమకు ఎంతధరకు కేటాయించారో, ప్రతిపక్షాలు, ఇతర పారిశ్రామిక వేత్తలకు కూడా అలాగే కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎపిఐఐసి నిబంధనల మేరకు భూమి కేటాయిస్తే చిల్లర ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు.

పంచాయతీ ఉపఎన్నికల్లో వైసిపి విజయకేతనం

పంచాయతీ ఉపఎన్నికల్లో వైసిపి విజయకేతనం ఎగురవేసిందని ఎమ్మెల్యే శంబంగి అన్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో 10 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరిగితే, ఎనిమిది మంది వైసిపి మద్దతుదారులు విజయం సాధించారన్నారు. కానీ ప్రతిపక్షాలు భుజాలు ఎగరవేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, జెసిఎస్ మండల కన్వీనర్ టి.దామోదర్, కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారమివ్వాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వాసిత గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో గిరిజన ఇంజనీరింగ్ కళాశాలకు నిర్మాణం జరుగుతున్నటు టేఖరికండి గ్రామ రెవెన్యూలో సర్వేనెంబర్ 50లో 105 ఎకరాల భూమిని సేకరించారని, ఈ భూమిలో కురుపాం మండలం టేఖరకండి, జియమ్మవలస మండలం చంద్రశేఖర్ రాజపురం గిరిజనులు, పేదలు 32 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ గత 50 ఏళ్ల నుంచి జీవిస్తున్నారని వరి, పత్తి తదితర పంటలు పండిస్తున్నారని, టేకు, జీడి మామిడి చెట్లు కూడా ఉన్నాయని అన్నారు. వీరికి నష్టపరిహారం ఇవ్వాలని గత రెండేళ్లుగా ఆందోళన చేయడంతో గత ఏడాది భూమికి, భూమి ఇచ్చి చదును చేసి సాగునీటి సౌకర్యం కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చినా ఇంతవరకు ఎటువంటి భూమి ఇవ్వలేదని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గతనెల కురుపాం పర్యటనకు వచ్చినప్పుడు ఈ సమస్యపై వినతిని ఇవ్వగా, పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లేదన్నారు. కావున స్థానిక ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి కలుగజేసుకొని వెంటనే సమస్య పరిష్కారం చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఉలక వాసు, నాయకులు ఎం.మురళి, రాము, కృష్ణారావు, రాజు, బాధిత నిర్వాత గిరిజనులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నిర్వాసిత గిరిజనులు



పట్టణంలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు, ముస్లిములు

మణిపూర్ హింసకాండపై శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మణిపూర్‌లో జరుగుతున్న హింసకాండకు, మతోన్మాదానికి నిరసనగా సోమవారం పట్టణంలోని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, పిఎంజెజెఎసి ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, క్రైస్తవ, ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులు స్థానిక మార్కెట్ యార్డ్ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వరకు ప్రధాన రహదారి గుండా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ అమానీయమైన చర్యలు జరగడం చాలా దారుణమని దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని, బిజెపి మతోన్మాదాన్ని వ్యతిరేకించాలని ఉన్నారు. ఈ శాంతి ర్యాలీలో రెవరెండ్ బిషప్ సుదర్శనరావు, రెవరెండ్ ఫాదర్లు ఎస్.స్టీఫెన్ పాల్, పి.జాకబ్, కె.విజయరాజ్, కె.తంబిపాల్, ఎస్‌కె పాల్, ఎ.శ్యాముల్ రాజశేఖర్, కె.వరప్రసాద్, ఎం.స్టీఫెన్, వినయ్‌కుమార్, సంజీవరావు, ఎస్.జయరాజ్, బాలజోజి, కన్యలు, పాల్గొన్నారు..

ఇ- క్రాప్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

రైతులంతా తప్పనిసరిగా ఇ- క్రాప్ నమోదు చేసుకోవాలని డివిజనల్ గణాంక అధికారి చిన్నికృష్ణ అన్నారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులకు ఎఒ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు ఈ క్రాప్ నమోదు చేయాలని అలా అయితేనే ప్రకృతి వైపరీత్యాల వల్ల పాడైన పంటకు ఇన్సూరెన్స్ వస్తుందని పంటల బీమా వర్తిస్తుందని కావున రైతుకు ఇ-క్రాప్ నమోదయ్యేలా వ్యవసాయ సహాయకులు కీలక బాధ్యత తీసుకొని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఒ రవిబాబు, మండలంలోని వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.


నగేష్‌రెడ్డిని సన్మానిస్తున్న దాసరి కల్చరల్ అకాడమీ సభ్యులు

నగేష్‌రెడ్డికి పురస్కారం

ప్రజాశక్తి - కురుపాం

మన్యం జిల్లా నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డికి గిరిజన ప్రాంతంలో గిరిజనులకు అందించినటువంటి ఉత్తమ వైద్య సేవలను గుర్తించి దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖరత్న కళాపరిషత్ ఆధ్వర్యంలో 35వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా విశాఖ జిల్లాపౌర గ్రంథాలయంలో వ్యవస్థాపక అధ్యక్షులు కళా భూషణ డాక్టర్ పిఎ భాస్కరరావు ఆదివారం విశాఖలో ఘనంగా సన్మానించి దాసరి ఆత్మీయ 2023 పురస్కారం జ్ఞాపిక, ప్రసంశాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ గిరిజన లోతట్టు ప్రాంతాల్లో అనేక నేత్ర వైద్య శిభిరాలు నిర్వహించి ఎందరో అభాగ్యులకు చూపును మెరుగు పర్చేందుకు తోడ్పాటు చేశారని, ఆయనకు ఇలాంటి పురస్కారాలు అందుకున్నారన్నారు. ఆయనకు పురస్కారం రావడం పట్ల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగన్నాథరావు, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ భాస్కరరావు, తోటి ఉద్యోగులు, కార్యాలయం సిబ్బంది అభినందించారు.


ఈశ్వరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు

వృద్ధ కళాకారుడికి ఘన సన్మానం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని మిర్తివలసలో ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం తుమరాడకు చెందిన వృద్ధ కళాకారుడు చాకరాపల్లి ఈశ్వరరావుకు ఆ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం.శేషగిరి రావు మాట్లాడుతూ 79ఏళ్ల వయస్సులో కూడా తన మధురమైన గాత్రం చేత దేశభక్తి గీతాలతో కూడిన పాటలను సినీ పాటలను పాడటం అభినందనీయమని అన్నారు. పిల్లలకు దేశభక్తి గీతాలపై మక్కువ పెంచేలా కృషి చేయడం అభినందనీయమని అన్నారు. సుమారు రెండు వేలు దాటి ప్రదర్శనలు చేసి 300కు పైగా సన్మానాలు జరిపించుకుని తనదైన శైలిలో గుర్తింపును సంపాదించుకున్నారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాలతో సన్మానించి పుష్పగుచ్చారందిం చారు. కార్యక్రమంలో సహోపాధ్యాయులు ధనంజయరావు, కృష్ణవేణి, త్రివేణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అండర్ -19షటిల్ విజేతలుగా పంట్ల బ్రదర్స్

ప్రజాశక్తి - కురుపాం


షీల్డ్‌లను అందుకుంటున్న పంట్ల సోదరులు

ఇటీవల రాయగడ సద్భావన ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కురుపాం శివ్వాలవీధికి చెందిన పంట్ల అభిరామ్ (అండర్19). పంట్ల. చక్రవర్తి (అండర్ 15) విజేతలుగా నిలిచారు. రాయగడ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ విజేతలుగా నిలవాలని కోరారు. అభిరామ్, చక్రవర్తిల తండ్రి నాగభూషణ్ సీనియర్ షటిల్ క్రీడాకారుడు. జెమ్స్ క్లబ్ మెంబర్. ప్రస్తుతం జె.కె పేపర్ మిల్లులో పనిచేస్తూ జెకె షటిల్ క్లబ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. వీరిద్దరిని జెమ్స్ క్లబ్ సభ్యులు అభినందించారు.

దశమంతపురంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురంలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాల రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.ఉషారాణి, సచివాలయ కార్యదర్శి కె.సునీల్ కుమార్, సూపర్వైజర్ నయామీ, ఎంఎల్ హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు 104సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్‌లో భాగంగా సోమవారం పలు వార్డుల్లో స్ప్రేయింగ్ నిర్వహించారు. పట్టణంలోని 1, 6, 14, 18, 22, 24, 27 వార్డుల్లో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కెవి ఫకీర్‌రాజు ఆధ్వర్యాన సిబ్బంది స్ప్రేయింగ్ చేశారు. దోమల నివారణపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కోరారు.

నిర్వాసితులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - పాచిపెంట

జిల్లాలోని పెద్దగెడ్డ, తోటపల్లి ప్రాజెక్టుల నిర్వాసితులకు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో కోటికిపెంటలో పెద్దగెడ్డ జలాశయం నిర్వాసితుల సంఘం నాయకులు రాకోటి పాపారావు, సలాది నరసింహులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాడి సాధించే తోటపల్లి, పెదగెడ్డ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. మొదటి నుండి మహిళలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని అధికారులకు ఎన్నిసార్లు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని చెప్పినా పట్టించుకోలేదని అన్నారు. ఎన్నో త్యాగాల ఫలితంగా జలాశయాలకు భూములు, ఇళ్లు కోల్పోయి సర్వం త్యాగం చేసిన వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉందన్నారు. కానీ కార్పొరేట్ సంస్థలు, పెద్ద పెద్ద కాంట్రాక్టర్లకు లాభాల కోసం నిర్వాసితులను నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నారని, నిర్వాసితులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నా యని విమర్శించారు. మహిళలకు కూడా చట్టం ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని, దీనికి నిర్వాసితులంతా కదలి రావాలని అన్నారు. అనంతరం మహిళలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరుతూ ప్రచురించిన కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, నిర్వాసితులు పాల్గొన్నారు.





గుమ్మలక్ష్మీపురం : కేదారిపురంలో మహాశక్తియాత్ర నిర్వహిస్తున్న జగదీశ్వరి; సీతంపేట : కుడ్డపల్లిలో భవిష్యత్తుకు గ్యారంటీ ర్యాలీ నిర్వహిస్తున్న జయకృష్ణ

కేదారిపురంలో మహాశక్తి యాత్ర

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారిపురం గ్రామ పంచాయతీలో జోబుగూడ, వేపమానుగూడ, కెడి కాలనీ, సెంటర్‌గూడ, సీమలగూడలో మహాశక్తి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కురుపాం నియోజకవర్గ ఇన్చార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పిలుపునిచ్చారు. మహిళలు అభివృద్ధి చెందితే కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ఇందులో మహిళా సంక్షేమం కోసం టిడిపి మేనిఫెస్టో రూపొందించడం జరిగిందన్నారు. మహాశక్తి కార్యక్రమంలో భాగంగా గ్రామ గ్రామానికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరిస్తున్నట్లు ఆమె తెలిపారు. నాలుగున్నరేళ్ల పాలనలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షులు కద్రక కళావతి, నాగవేణి, క్లస్టర్ ఇంచార్జ్ వెంకట్రావు తదితరులు ఉన్నారు.

కుడ్డపల్లిలో భవిష్యత్తు గ్యారెంటీ

సీతంపేట : మండలంలోని కుడ్డపల్లి పంచాయతీ పరిధిలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ మహిళలకు భద్రత, భరోసా ఆర్థిక అండ ఇవ్వగల ఏకైక నాయకుడు నారా చంద్రబాబు నాయుడు వల్లే సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, సీనియర్ నాయకులు నిమ్మక నాగేశ్వరావు, నిమ్మక కృష్ణ, సింహాద్రి, ఊయక నారాయణ, పాలక సింహాచలం, బిడ్డిక నారాయణ, జీలకర్ర దిలీప్ కుమార్, చిన్నారావు, ఆరిక కూర్మారావు, స్థానిక మహిళా నాయకులు పాల్గొన్నారు.

దోనుబాయి పిహెచ్‌సి పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా గర్భిణీలకు, బాలింతలకు పూర్తి స్థాయిలో ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. సిబ్బందితో సమీక్ష జరిపి పలు ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి నివేదికలను పరిశీలించి పురోగతి సాధించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో గర్భిణీలకు, బాలింతలకు గ్రామీణ స్థాయిలోనే అందుబాటులో ఉన్న ఆరోగ్య పరీక్షలన్నీ పూర్తి స్థాయిలో నిర్వహించాలన్నారు. ఆ వివరాలను ఎఫ్‌డిపి యాప్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు. యాప్‌లో ఇచ్చిన గర్భిణి కాన్పు సంఖ్య, బిపి, షుగరు, కాళ్లు వాపులు పరిశీలన, పిండం యొక్క గుండె స్పందన, బాలింతలో గర్భాశయ స్థితి, రక్తస్రావం పరిశీలన తదితర ఆరోగ్య తనిఖీలు చేపట్టి నమోదు చేయాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లల్లో షెడ్యూలు ప్రకారం వ్యాధి నిరోధక టీకా పడని వారిని గుర్తించి టీకా వేయాలన్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహనరావు ల్యాబ్ రికార్డులు తనిఖీ చేసి ప్రతి రోజూ నిర్వహిస్తున్న జ్వర నిర్ధారణ పరీక్షలు, వాటి ఫలితాలను పరిశీలించారు. జ్వరాలను గుర్తిస్తే తక్షణమే చికిత్స అందజేసి తగ్గే వరకు క్షేత్ర స్థాయి సిబ్బంది పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించి దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. అన్ని గ్రామాల్లో జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్.భానుప్రతాప్, సూపర్ వైజర్లు దమయంతి, గంగమ్మ, డెమో యోగీశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిలకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మంజుల వీణ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల కాలంలో ఏర్పాటు చేసిన విద్యార్థినిల మరుగుదొడ్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినిలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ముఖ్యంగా విద్యార్థినిలకు మరుగుదొడ్లు, తాగునీరు వంటి సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. మౌలిక వసతులతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనలు అందించేందుకు ప్రభుత్వం అన్నివేళలా కృషి చేస్తుందని తెలిపారు. కాబట్టి తల్లిదండ్రులు విషయాన్ని గమనించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తమ పిల్లలను చదివించుకొని మంచి భవిష్యత్తును ఇవ్వాలని కోరారు. ఆమెతో పాటు కాలేజీ ప్రిన్సిపల్ వై.నాగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి సచివాలయాల్లో ఆధార్ సేవలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో అన్ని గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలను ఈనెల 25 వరకు నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ జి.పైడితల్లి తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. గరుగుబిల్లి, రావివలస, ఉల్లిభద్ర గ్రామాల్లోని గ్రామ సచివాల యాల్లో మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఆధార్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్ కార్డుల్లోని జిల్లా మార్పుతో పాటు ఫోన్ నెంబర్లు మార్చుకోవడానికి అవకాశం ఉందన్నారు. కావున మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లీకులను నివారించాలి

బొబ్బిలి: స్థానిక షిరిడి సాయిబాబా ఆలయం ఎదురుగా మున్సిపల్ పైపులైన్ లీకులను నివారించాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు కోరారు. పైపులైన్ లీకులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్ లీకులతో ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు అందడం లేదన్నారు.

తప్పల్లేకుండా పంట కోత ప్రయోగాలు చేయాలి : ఎడిఎ

ప్రజాశక్తి - పాచిపెంట

గ్రామ వ్యవసాయ సహాయకులంతా పంట కోత ప్రయోగాలను ఎలాంటి తప్పుల్లేకుండా చాలా కచ్చితంగా నిర్వహించాలని సాలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్ రావు అన్నారు. పంట కోత ప్రయోగాలపై మండలంలోని కొటికపెంట ఆర్‌బికెలో విఎఎలకు నిర్వహించిన మండల స్థాయి ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. పంటల బీమా పంట కోత ప్రయోగాల ఆధారంగా మాత్రమే ఇవ్వబడుతుందన్నారు. కాబట్టి ఎలాంటి అవకతవకలు లేకుండా పక్కా ప్రణాళికతో పంట కొత్త ప్రయోగాలు నిర్వహించాలని ఏమైనా సమస్యలుంటే అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ వారిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమ శిక్షకులుగా విచ్చేసిన ఎఎస్‌ఒ ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ రెండు రోజులు ముందుగానే పంటల భీమా కంపెనీ ప్రతినిధులకు తెలియజేయాలని, ఫారం-1 ముందుగానే పంపించాలని, పంట కోత ప్రయోగాల సూపర్వైజర్లకు జిల్లా యాజమాన్యానికి తెలియజేయాలని ఎలాంటి అవకతవకలు లేకుండా పంట కొత్త ప్రయోగాలు నిర్వహణ చేపట్టాలని అన్నారు. జాతీయ ఆదాయం లెక్కలకు పంటల భీమా పరిహారానికి పంట నష్టపరిహారాల పరిహారానికి అన్నింటికీ ఈ పంట గుంత ప్రయోగాలు ఉపయోగ పడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ కె.తిరుపతిరావు, విఎఎలు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని పెదభోగిలి రైతు భరోసా కేంద్రంలో సీతానగరం మండలం గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు పంట కోత ప్రయోగాలపై డివైఎస్‌ఒ, ఎఎస్‌ఒ సతీష్ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ క్లైమ్ అనేది ఈ పంటకోత ప్రయోగాలు ఆధారంగానే ఇవ్వటం జరుగుతుందని, ఐదేళ్ల ముందున్న నార్మల్‌వైల్డ్ ప్రాతిపదికన పంట దిగుబడి నష్టాన్ని అంచనా వేస్తారని, జిల్లాలో అధికంగా పండిస్తున్న పంటను బట్టి పంటకోత ప్రయోగాలు ఏ పంటకు చేయాలని నిర్ణయించబడతాయని తెలిపారు. అలాగే జిల్లాలో ఒక గ్రామం



సీతానగరం : సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి అవినాష్

యూనిట్‌గా వరికి బీమా అమలు చేస్తున్నామని, ప్రతి 100 హెక్టార్లను ఒక యూనిట్‌గా తీసుకొని పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నామన్నారు. వరి, గోగునార, చెరకులో **5×5** మీటర్లు, కందిలో 10×10 మీటర్ల ప్లాట్‌లో పంటకోత ప్రయోగం నిర్వహించాలని, సర్వే నెంబర్, సబ్ డివిజన్ ద్వారా నైరుతి మూల దిశగా, వ్యతిరేక సవ్య దిశలో ప్లాట్ ఐడెంటిఫికేషన్ చేయాలన్నారు. పంట కోత ప్రయోగాలకు నిర్దేశించిన యాప్‌లో ర్యాండమ్‌గా ఎంపికచేసిన రైతుల వివరాలను నమోదు చేయాలన్నారు. పంట రకాన్ని పంటకోత కోసే సమయాన్ని జాగ్రత్తగా వేయాలని తెలిపారు. అలాగే ఖరీఫ్-2023, ఇ-పంట నమోదు జియో కో ఆర్డినేట్లతో చేస్తున్నామని, రైతులంతా గ్రామ వ్యవసాయ సహాయకులు దగ్గర తాము వేసిన పంటకు గాను పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి తెలియచేశారు. కార్యక్రమంలో ఎఒ అవినాష్, డివైఎస్‌ఒ, ఎడిఎ వెంకటేష్, విఎఎలు,ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

బయో ఇన్‌పుట్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని మిర్తివలసలో గల డాక్టర్ శంబంగి శ్రీనివాసరావు మామిడితోటలో ఎపిసిఎన్‌సి వారిచే ఏర్పాటు చేసిన బయో ఇన్పుట్ సెంటర్‌ను ఎఒ శ్రావణ్‌కుమార్ సోమ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా100 లీటర్ల అగ్నిస్త్రం, 200 లీటర్ల నీమాస్త్రం, 4వేల లీటర్ల ద్రవ జీవామృతం తయారు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఎన్‌పిఎం, మరియు బయో ఇన్పుట్ సెంటర్ల సేవలను చిన్న, సన్నకారు రైతులు వినియోగించుకొని వ్యవసాయ పెట్టుబడి ఖర్చులను తగ్గించుకొని అధిక దిగుబడులను పొందాలన్నారు. అలాగే ఆరోగ్యాలను కాపాడుకోవాలని వివరించారు. బయో ఇన్పుట్ సెంటర్లో లభించిన దశపర్ణిక, అగ్నిఅస్త్రం, బ్రహ్మాస్త్రం, మీనామృతం, ఎగ్ ఏమి నో యాసిడ్, పంచగవ్య, పుల్లటి మజ్జిగ, జీవామృతాలను రైతులు వినియోగించుకుంటారని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది మానస, శారద, లక్ష్మీ, దేవీప్రసాద్, తిరుపతిరావుతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ఎన్ఎఫ్ రైతులు పాల్గొన్నారు.


మామిడితోటలో బయోఇన్‌పుట్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎఒ శ్రావణ్‌కుమార్

రహదారికి ఇబ్బంది లేకుండా చూడాలి

ప్రజాశక్తి - పాలకొండ

రహదారికి ఇబ్బంది లేకుండా చూడాలని వడమ జంక్షన్ దగర ఉన్నవారంతా సోమవారం నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావుకు వినతిని అందజేశారు. వడమ చెరువు అభివృద్ధి చేస్తున్నారని ఇది ఎంతో మంచి పరిణామమని అన్నారు. అయితే చెరువుకు రెండు వైపులా గేట్ ఏర్పాటు చేస్తానని చెపుతున్నారని, గేటు ఏర్పాటు చేస్తే తమ నడకదారికి ఇబ్బందులు ఎదురవుతాయని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆ చెరువు గట్టే తమకు ప్రధాన నడక మార్గం అన్నారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు.



రిలేనిరాహారదీక్షలో పాల్గొన్న గిరిజనులు

ఐదో రోజుకు రిలే దీక్ష

ప్రజాశక్తి - కొమరాడ

పాలకులు, అధికారులు వంతెన నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి పనులు చేపట్టాలని పూర్ణపాడు లాబేషు వంతెన సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం ఐదో రోజు వంతెన సాధన కమిటీ ఆధ్వర్యంలో రిలే దీక్ష కొనసాగింపు చేపట్టారు. ఈ సందర్భంగా సాధన కమిటీ సభ్యులు శ్రీను, నూకరాజు మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యంతో గిరిజనులకు దీర్ఘకాలంగా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నాగావళి నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. 2006లో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి నేటికీ పూర్తి కాకపోవడం చూస్తే గిరిజన పట్ల పాలకులకు, ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్ధమవుతుందని ఎద్దేవా చేశారు. తక్షణమే వంతెన నిర్మాణానికి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే మరో మూడు రోజులపాటు జరిగే దీక్షలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

తప్పుడు అభియోగాలతో తొలగించారు

ప్రజాశక్తి - బెలగాం

తనపై తప్పుడు అభియోగాలు మోపి మధ్యాహ్న భోజన పథకం నుంచి తప్పించారని, తనకు న్యాయం చేయాలని కార్మికురాలు తట్టికోట గణమ్మ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావుతో కలిసి కలెక్టర్‌కు సోమవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు న్యాయం చేయాలని కోరుతూ మూడునెలలుగా వినతులు ఇస్తున్నా, అధికారులు స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేసింది. బలిజిపేట మండలం పి.చాకరపల్లికి చెందిన తాను 20ఏళ్ల నుంచి తమ గ్రామ ప్రాథమిక పాఠశాలలో వంట చేస్తున్నానని, తనను రాజకీయ కారణాలతో తనకు తెలియకుండా స్కూల్ కమిటీ పిల్లలతో గోప్యంగా తీర్మానం చేయించి తనను అన్యాయంగా తొలగించారని అన్నారు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ కలెక్టర్ చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్న తనకు న్యాయం చేయడం లేదన్నారు. తాను చాలా నిరుపేదనని, 20ఏళ్లుగావంట చేస్తున్న తనను ఇప్పుడు వంట బాగోలేదని తప్పుడు అభియోగం మోపి తనను తొలగించారన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి స్కూల్లో వంట చేయడానికి అవకాశం కల్పించాలని కోరారు.

30న ఐటిఐలో మూడో విడత కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఐటిఐ ఈనెల 30న మిగిలిన సీట్లుకు మూడో విడత కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్లైన్ చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. iti.ap.gov.in వెబ్‌కు ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని, 28గా ఐటిఐలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకోవాలని కోరారు.

సాలూరు: ప్రభుత్వ ఐటిఐలో మిగులు సీట్లకు ఈనెల 21నుంచి 27వరకు ఆన్ లైన్ లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.28న ఎస్ఎస్సి,కులం, నివాస ప్రాంతం ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని చెప్పారు.ఈనెల 30న ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపల్ రవికుమార్ ఆ ప్రకటనలో కోరారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని భద్రగిరి ఆర్‌ఐటిఐలో మూడో విడత కౌన్సిలింగ్ కొరకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్. సునీల్ కుమార్ కోరారు. దరఖాస్తులు చేయ గోరే విద్యార్థులు ఈనెల 27 లోపు దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని అన్నారు. 30న స్థానిక ఆర్ఐటిఐలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. భద్రగిరి ఆర్ఐటిఐలో ఫిట్టర్, ఎలక్ట్రీషన్, వెల్డర్, కంప్యూటర్ అప్లికేషన్ తదితర కోర్సులు ఉన్నాయని అన్నారు.

కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - బెలగాం

తమ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని మండలంలో కృష్ణపల్లికి చెందిన చంద్రన్న కాలనీవాసులు కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జనసేన నాయకులతో కలిసి కలెక్టర్‌కు వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2017-18లో చంద్రన్న కాలనీ గ్రామంలో ఏర్పాటు చేశారన్నారు. వాటికి పునాది బిల్లు తప్ప మిగతా బిల్లు ఎంతవరకు ఇవ్వలేదన్నారు. కాలనీలో 19 ఇళ్లు నిర్మించుకొని నివాసముంటే కనీస మౌలిక సౌకర్యాలు లేవన్నారు. వసతులు కల్పించాలని పలుమార్లు సంబంధిత పాలకులు, అధికారులు కోరినా ప్రయోజనం లేదన్నారు. చంద్రన్న కాలనీకి పక్కనే నిర్మించిన జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఈ విషయమై గ్రామంలో చంద్రన్న కాలనీవాసులను చూసి జగనన్న కాలనీవాసులు ఎద్దేవా చేసే పరిస్థితి నెలకొందన్నారు. గ్రామాన్ని విభజించి పాలించడం పాలకులకు, అధికారులకు తగదన్నారు. తక్షణమే చంద్రన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కాలనీవాసులు సమస్యలు పరిష్కరించమని అడిగితే టిడిపి వారంటూ ఏర్పాటు వాదంతో మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైసిపి వారికే ప్రభుత్వం, అధికారులు పనిచేస్తారా...? అని ప్రశ్నించారు. తక్షణమే చంద్రన్న కాలనీలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు

నేరాలు ఘోరాలు

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పార్వతీపురం స్వీపర్ వీధికి చెందిన పాలకొండ చంద్రశేఖర్ (30) కొద్ది సంవత్సరాల నుండి తాగుడుకు బానిసై ఆరోగ్యం పాడైంది. అనారోగ్యంతో బాధపడుతూ మనస్థాపనతో గుర్తు తెలియని ద్రావణం తాగి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్పందించిన స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించినప్పటికీ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మరణించాడు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

పట్టణంలో దొంగల బీభత్సం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

పట్టణంలో దొంగలు బీభత్సం సృష్టించారు. సౌందర్య సినిమా హాల్ వెనుక ఉన్న నీలం రాజేశ్వరరావు అనే అడ్వకేట్ ఇంట్లో దొంగతనం జరిగింది. 20 తులాల బంగారం, రెండు కేజీలు వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కొద్దిరోజుల క్రితం పుణ్యక్షేత్రాలకు వెళ్లడంతో దొంగతనం ఎప్పుడు జరిగిందనేది తెలియాల్సి ఉంది. అలాగే పట్టణంలోని కొత్తవలసకు చెందిన ఓ వ్యక్తి ఇంట్లో రెండు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకుపోయారు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - వీరఘట్టం


తుప్పల్లోకి దూసుకుపోయి బోల్తాపడ్డ వ్యాను

మండల కేంద్రానికి సమీపాన గల చిదిమి గ్రామ జంక్షన్ వద్ద సోమవారం వాహనం బోల్తా పడి తుప్పల్లోకి దూసుకుపోయింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలోని యు.వెంకం పేటకు చెందిన ముగ్గురు వ్యక్తులు కార్లో వస్తుండగా చిదిమి జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఈ ఘటన జరిగింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు అక్కడికి చేరుకొని పరిశీలించగా ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. ముగ్గురు వ్యక్తులు క్షేమంగా ఉన్నట్లు ఎస్సై ఎం వెంకటరమణ తెలిపారు. మలుపు వద్ద పిచ్చి మొక్కలు తొలగించక పోవడంతో ఎప్పటికప్పుడే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మొక్కల వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. వీటిని తొలగించడంలో ఆర్‌అండ్‌బి అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపు వద్ద పిచ్చి మొక్కలు తొలగించాలని స్థానికులు కోరుకున్నారు.